నమస్తే తెలంగాణ





అప్‌గ్రేడేషన్‌కు అనుకూల తీర్పు రావడంతో ఢిల్లీలో సుప్రీంకోర్టు ఎదుట అభివాదం చేస్తున్న ఆర్‌యూపీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్, నర్సిములు, నాయకులు

# భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌కు గ్రీన్‌సిగ్నల్

- పదోన్నతుల వ్యతిరేక కేసు కొట్టివేత
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం
- ఉపాధ్యాయ సంఘాల హర్షం

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్‌కు సుప్రీంకోర్టు పచ్చజెండా ఊపింది. దీంతో వారి ఇరవై ఏండ్ల ఎదురుచూపులకు తెరదించినట్టయింది. స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్)పోస్టులను గ్రేడ్ –2 పండితులకే, పీడీ పోస్టులను పీఈటీలకే కేటాయించాలన్న రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పును సవాల్‌చేస్తూ దాఖలు చేసిన కేసును సుప్రీంకోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. దీంతో స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్), ఫిజికల్ డైరెక్టర్ పదోన్నతులు కల్పించేందుకు అడ్డంకులన్నీ తొలగిపోయాయి. దీంతో తాజాగా చేపట్టిన టీచర్ల పదోన్నతుల్లో 8,156 మంది భాషాపండితులకు, 1,847 పీఈటీలకు పదోన్నతులు దక్కుతాయి. ఈ తీర్పుపట్ల భాషాపండితులు, పీఈటీలు హర్షం వ్యక్తంచేశారు.

### న్యాయం చేసిన కేసీఆర్

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా భాషాపండితులను అప్‌గ్రేడ్‌చేస్తామని అప్పటి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, భాషాపండితులు, పీఈటీలను అప్‌గ్రేడేషన్ చేస్తూ జీవోలను జారీచేశారు. ఈ మేరకు జీవో నెంబర్ 2, 3, 9, 10లను అప్పటి సర్కారు జారీచేసింది. సర్వీస్‌రూల్స్‌ను సైతం జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కొందరు హైకోర్టుకెళ్లగా హైకోర్టు సింగిల్ బెంచ్ ఇది న్యాయబద్ధంకాదని తీర్పు ఇచ్చింది. సెకండరీ గ్రేడ్ టీచర్లకు కూడా పదోన్నతులు కల్పించాలని సింగిల్‌బెంచ్ తీర్పు ఇచ్చింది. సింగిల్ బెంచ్ తీర్పును వ్యతిరేకిస్తూ భాషాపండితులు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. డివిజన్ బెంచ్ భాషాపండితులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. గ్రేడ్ –1 పోస్టులను గ్రేడ్ –2 వారికి పదోన్నతులు కల్పించి నింపాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై కొంత మంది టీచర్లు మళ్లీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసు శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. కేసును డిస్మిస్ చేసి, హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సమర్థించింది. దీంతో తాజాగా కొనసాగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో మల్టీ జోన్ –1, 2లతో భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజ్), పీఈటీలకు పీడీలుగా పదోన్నతులు పొందేందుకు వీలుకలిగింది.

### సుదీర్ఘ పోరాటం ఫలించింది



భాషాపండితుల సుదీర్ఘ న్యాయ పోరాటం, కల నేడు ఫలించింది. ఇది పాఠశాల విద్యలో భాషా బోధనకు మంచిరోజుగా అభివర్ణించవచ్చు. నాడు ప్రపంచ తెలుగు మహాసభల్లో కేసీఆర్ రాష్ట్రంలోని భాషాపండితులకు తీపిక బురందించారు. భాషాప్రేమికుడైన అప్పటి సీఎం వల్లే ఇది సాధ్యమైంది. భాషాపండితులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పెద్ద ఉపకారమిది. తన విజ్ఞప్తి మేరకు ఇంతటి చొరవ తీసుకుని భాషాపండితులకు న్యాయం చేసిన కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

– దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ

### 20 ఏండ్ల కల సాకారంకాబోతున్నది

సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యూపీపీటీఎస్) స్వాగతిస్తున్నాం. తమ 20 ఏండ్ల కల సాకారంకాబోతున్నది. ఈ కీలక తీర్పు వెలువడేందుకు సహకరించిన అధికారులు, న్యాయవాదులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– జగదీశ్, నర్సిములు, ఆర్‌యూపీపీ టీఎస్

# కొలువులివ్వండి కాల్మొక్త!

- కాంగ్రెస్ నేత కాళ్లపై పడిన యువతి
- గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని వినతి
- హామీ ఇవ్వని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- ఇది రాకపోతే, మరో పరీక్ష రాసుకోండని ఉచిత సలహా
- ప్రభుత్వ తీరుపై నిరుద్యోగుల ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో ఒక నిరుద్యోగ యువతి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి కాళ్ల మీద పడినతీరు నిరుద్యోగ యువతను కదిలించింది. రాష్ట్రంలో ఈ నెల 9న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించినవారిని 1:50 నిష్పత్తిలో కాకుండా, 1:100 చొప్పున మెయిన్ పరీక్షలకు ఎంపిక చేయాలని పరీక్షార్థులు కోరుతున్నారు. ఇదే అంశంపై శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చిన్నారెడ్డిని పలువురు నిరుద్యోగులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమయంలో ఒక మహిళ చిన్నారెడ్డి కాళ్ల మీద పడింది. మెయిన్ పరీక్షలకు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని, గతంలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రూప్–2లో రెండు వేలు, గ్రూప్–3లో మూడు వేల చొప్పున పోస్టులు పెంచాలని ప్రాధేయపడింది. అయినప్పటికీ, చిన్నారెడ్డి నుంచి వారికి ఎలాంటి హామీ లభించలేదు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి నిరుద్యోగులతో మాట్లాడుతూ.. 'ప్రస్తుత ఉద్యోగ నోటిఫికేషన్ పరీక్షలు రాసుకోండి. ఈ నోటిఫికేషన్ ద్వారా మీకు ఉద్యోగాలు రావా? రాకపోతే మరో నోటిఫికేషన్ వస్తుంది. దానికి ప్రిపేర్ అవండి' అంటూ ఉచిత సలహా ఇచ్చారు. రాష్ట్రంలో వచ్చే నాలుగేండ్లలో 30 లక్షల మందికి స్కిల్స్ నేర్పించి, మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పారు. అంతేతప్ప నిరుద్యోగుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించలేదు. దీంతో నిరుద్యోగులు ఒక్కసారిగా హతాశులయ్యారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలేమిటి? ఇప్పుడు మాట్లాడుతున్నదేమిటి? అంటూ ఆవేదన వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో సీఎల్పీ నేతగా వ్యవహరించిన ప్రస్తుత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సైతం గ్రూప్–1 మెయిన్‌కు 1:100 నిష్పత్తిలో అవకాశం కల్పించాలని అసెంబ్లీలో కోరారని నిరుద్యోగులు గుర్తుచేస్తున్నారు. నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అసెంబ్లీ సాక్షిగా చేసిన డిమాండ్‌ను నేడు అధికారంలో ఉండి కూడా నెరవేర్చకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

### 1:100 ఎందుకంటే..

వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తొలిసారిగా 503 పోస్టుల భర్తీకి గ్రూప్–1 నోటిఫికేషన్ విడుదలైంది. నాడు భారీ నోటిఫికేషన్ వెలువడటంతో ఎన్నో ఆశలతో లక్షలాది నిరుద్యోగులు పరీక్షలకు హాజరయ్యారు. గ్రూప్–1 పరీక్ష పేపర్ లీక్ అవ్వడం, ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆ నోటిఫికేషన్‌నే రద్దు చేశారు. గ్రూప్–1 పరీక్షల కోచింగ్‌ల కోసం ఎంతో ఖర్చు చేసిన చాలామంది అభ్యర్థులకు మరోసారి పరీక్ష నిర్వహణ ఆర్థికంగా భారంగా పరిణమించింది. కొంతమందికి ఉద్యోగార్హత వయసు కూడా దాటిపోతున్నది. సుదీర్ఘకాలం నిరీక్షించలేక కొందరు ఏదో ఒక పనిలో చేరిపోయారు. ఈ నేపథ్యంలో గ్రూప్–1 కొత్త నోటిఫికేషన్ ప్రకారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షలకు అభ్యర్థులు సరిగా ప్రిపేర్ కాలేకపోయారు. కొందరు నిరుద్యోగులు కాం గ్రెస్ తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనగా, ఇన్ సర్వీస్ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.

### ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం: తెలంగాణ నిరుద్యోగ యువత

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి, ఓటర్ల కాళ్లు పట్టుకుని మరీ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని ప్రచారం చేశామని నిరుద్యోగులు గుర్తుచేసుకుంటున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్ని ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కనీసం సమీక్ష కూడా జరగడం లేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

# నాడు రెచ్చగొట్టి.. నేడు పట్టించుకోరా?

- ఉద్యోగార్థులు నేతల కాళ్లు పట్టుకోవడం దురదృష్టకరం
- అధికారంలోకి రాగానే హామీలు తూచ్
- మెగా డీఎస్సీ అని చెప్పి 11 వేల పోస్టులే
- ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలేవి?
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ఉద్యోగార్థులు పోస్టుల సంఖ్య పెంచాలని అధికార పార్టీ నాయకుల కాళ్లు పట్టుకొనే పరిస్థితి రావడం దురదృష్టకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. విపక్షంలో ఉన్నప్పుడు నిరుద్యోగులను రెచ్చగొట్టడం, అధికారంలోకి రాగానే విస్మరించటం కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని ఆరోపించారు. గ్రూప్–1 మెయిన్‌కు 1:100 అర్హతను పరిగణించాలని, గ్రూప్ 2, 3 పోస్టులు పెంచాలని అభ్యర్థులు నాయకుల కాళ్లు పట్టుకొని వేడుకోవడం బాధాకరమని శుక్రవారం ఆయన ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రూప్–1 మెయిన్‌కు 1:100 అర్హతను పరిగణించాలని కోరిందని, అధికారంలోకి రాగానే ఎందుకు మరిచిపోయిందని ప్రశ్నించారు. 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఎన్నికల హామీగా చెప్పిన కాంగ్రెస్.. 11 వేల పోస్టులు మాత్రమే వేసి చేతులుదులుపుకున్నదని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఆరు నెలలు గడుస్తున్నా ఎలాంటి ప్రణాళిక రూపొందించకపోవడం మోసం చేయడమేనని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భర్తీ చేసిన పోస్టులకు నియామక పత్రాలు అందించి, 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని డబ్బా కొట్టుకోవడం తప్ప, యువత, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ ఏమి చేసిందని నిలదీశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రూప్స్ అభ్యర్థుల వినతులను పరిగణలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య పెంచడంతోపాటు, ఎన్నికల మ్యానిఫెస్టోలో యువతకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందని తెలిపారు.

### తక్షణమే పింఛన్ రూ.4వేలకు పెంచాలి

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నీటి మూటలను తలపిస్తున్నాయని హరీశ్‌రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన కాంగ్రెస్ పార్టీ 191 రోజులు గడిచినా ఆచరణలో మాత్రం విఫలమైందని ఆయన ఎక్స్ వేదికగా ఎత్తిచూపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగా, వృద్ధులు, వితంతువుల పింఛన్లు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పెంచుతూ తక్షణం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పక్క రాష్ట్రం ఏపీలో అధికారంలోకి రాగానే అక్కడి ముఖ్యమంత్రి అన్ని రకాల పింఛన్లు పెంచారని, ఒరిస్సా ముఖ్యమంత్రి వరి కనీస మద్దతు ధరను క్వింటాల్‌కు రూ.3100 చేస్తూ నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని సూచించారు. పది శాతం మాత్రమే పండించే సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చేతులు దులుపుకున్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో చెప్పినట్టుగా అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన 6 గ్యారెంటీలు, 13 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

# చింపేయండి.. తిరిగివ్వండి.. అతికించండి!

మొదటిపేజీ తరువాయి...

పుస్తకాలను ఎమ్మార్సీలకు, జిల్లా గోడౌన్‌లకు రిటర్న్‌చేయాలని పేర్కొన్నారు. మళ్లీ ఏమైందో ఏమో కానీ శుక్రవారం తాజా ఆదేశాలు జారీ చేశారు. కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రుల పేర్లు ఉన్న పేజీని కత్తిరించి కవర్ పేజీ వెనుక వైపు గమ్‌తో లేదా ఫెవికాల్‌తో అతికించాలని సూచించారు. కొన్ని స్కూళ్లలో తొలుత చింపిపారేసిన పేజీలు దొరక్కపోవడంతో టీచర్లు ఆ పేజీని జిరాక్స్ తీయించి అతికించాల్సి వచ్చింది. ముందు ఆ పేజీని చింపివేయాలని, ఆ తర్వాత పుస్తకాలను వెనక్కి ఇవ్వాలని, మళ్లీ అతికించాలని ఆదేశాలివ్వడం హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలోని 1–10 తరగతుల్లోని విద్యార్థులకు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసింది. అయితే, తెలుగు పుస్తకం ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి పేర్లు ఉన్నాయన్న కారణంతో దాదాపు 25 లక్షల పుస్తకాలను వెనక్కి తెప్పించారు. ఆయా పుస్తకాలను ఎమ్మార్సీలకు, జిల్లా గోడౌన్‌లకు చేర్చారు. ఈ చర్యను మాజీ విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తీవ్రంగా ఆక్షేపించారు. ఇది భావ్యంకాదని, తమిళనాడు, ఏపీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు వ్యవహరించినట్టు హుందాగా వ్యవహరించాలని సూచించారు.

### అధికారులిచ్చిన ఆదేశాలివే..

'ఈ సంవత్సరం అన్ని తెలుగు పాఠ్యపుస్తకాలపై పొరపాటున మాజీ మంత్రులు, అధికారుల పేర్లు ముద్రితమయ్యాయి. ఈ పేజీ వెనుకభాగంలో జాతీయగీతం, జాతీయగేయం, ప్రతిజ్ఞ ఉన్నాయి. ఈ పేజీని బ్లేడ్ లేదా కత్తెరతో జాగ్రత్తగా కట్‌చేయాలి. ఆ పేజీని అదే పుస్తకం కవర్‌పేజీ వెనుకభాగంలో అతికించాలి. ఈ విధంగా చేసేటప్పుడు మాజీ మంత్రులు, అధికారుల పేర్లున్న పేజీ కనపడకుండా ఉండేలా, జాతీయగీతం, జాతీయగేయం, ప్రతిజ్ఞ కనిపించేలా జాగ్రత్తపడాలి' అని అధికారులకు సూచించారు. మొత్తం ఈ ప్రక్రియను స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో పూర్తిచేయాలని పలు జిల్లాల డీఈవోలు ఆదేశాలిచ్చారు. తమ కాంప్లెక్స్ పరిధిలోని పుస్తకాలను ఆయా హెచ్‌ఎంలు తమ వద్దకు తెప్పించుకుని పేజీని చింపి, అతికించి తిరిగి సంబంధిత స్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు ఇవ్వాలని సూచించారు. శుక్రవారంలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, పూర్తయిన తర్వాత తమ కాంప్లెక్స్ పరిధిలో అతికించడం పూర్తయ్యిందని డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశాలిచ్చారు..

### ఇద్దరు అధికారుల బదిలీ

పాఠ్యపుస్తకాల వ్యవహారంలో ఇద్దరు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డి, ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణ సంస్థ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసచారిని బదిలీచేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాధారెడ్డిని ఎస్సీఈఆర్టీ నుంచి తప్పించి సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీచేశారు. ఇక్కడున్న గాజర్ల రమేశ్‌ను ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌గా నియమించారు. ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణ సంస్థ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసచారికి మాడల్ స్కూల్ డైరెక్టర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించగా, ఆయన స్థానంలో తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఆర్‌ఈఐ) కార్యదర్శి సీహెచ్ రమణకుమార్‌కు పాఠ్యపుస్తక ముద్రణ సంస్థ డైరెక్టర్‌గా బాధ్యత అప్పగించారు. అయితే ఉత్తర్వులో పలు తప్పులుండటం గమనార్హం. సమగ్రశిక్షకు అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ పోస్టు ఉండగా, ఈ పోస్టు పేరును అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పేర్కొన్నారు.

# రైతు భరోసాకు కిసాన్ సమ్మాన్ డాటానా?

- సాగు నిర్వీర్యానికి కాంగ్రెస్ ఎత్తుగడ
- రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలి
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రైతు భరోసాకు కిసాన్ సమ్మాన్ నిధి డాటాను ప్రాతిపదికగా వినియోగిస్తారా? అని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేయటమే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తున్నదని ఆరోపించారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన.. సర్కారు నిర్ణయం దుర్మార్గమైనదని ధ్వజమెత్తారు. రైతు భరోసాపై 7 నెలలు దాటినా కటాఫ్ తేదీ నిర్ణయించకపోవటం ప్రభు త్వ అసమర్థత, నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. దేశం లో రైతుబంధు పథకాన్ని తొలిసారి కేసీఆర్ ప్రభుత్వం అమ లు చేయడంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి ప్రధానమం త్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చిందని వివరించారు. ఆ పథకంలోనూ సవాలక్ష కారణాలు చెప్పి ఏటా మూడు విడతల్లో రూ.6 వేలు మాత్రమే ఇస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో 70 లక్షల మందికి పైగా రైతులు ఉంటే, కిసాన్ సమ్మాన్ నిధి అందేది 36.1 లక్షల మందికేనని తెలిపారు. ప్రస్తు తం రాష్ట్రంలో కిసాన్ సమ్మాన్ నిధి రైతుల సంఖ్య 29,78,394 మంది మాత్రమేనని వెల్లడించారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న గెల్లు శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో తుంగబాలు

# కేసీఆర్‌పై అక్కసుతో నిధుల దుర్వినియోగం

- బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఉన్న అక్కసుతో రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నదని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగు పాఠ్యపుస్తకాల్లో కేసీఆర్ పేరుండటంపై ప్రభుత్వ అభ్యంతరాలపై ఆయన ధ్వజమెత్తారు. విద్యాశాఖపై రేవంత్‌రెడ్డి కనీసం సమీక్షే నిర్వహించలేకపోయారని తెలిపారు. పాఠ్య పుస్తకాల ముద్రణ సమయంలోనే ముందుగా ఎందుకు దీనిపై సమీక్షించలేదని ప్రశ్నించారు. తమిళనాడు మాజీ సీఎం జయలలిత ఫొటోలున్న స్కూల్ బ్యాగ్‌లను విద్యార్థులకు అందజేయాలని ఆ రాష్ట్ర సీఎం నిర్ణ యం తీసుకున్నారని, తెలంగాణలో అం దుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో తన పేరు లేదనే దురుద్దేశంతో కోట్లాది రూపాయల భారం పడేలా చూస్తున్నారని విమర్శించారు. ప్రజాధనం దుర్వినియోగం చేయద్దని సీఎంకు హితవు పలికారు. పుస్తకాల్లో కేసీఆర్ పేరుంటే ఏమైతదని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సమావేశంలో టీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు తుంగ బాలు పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా లింగంపేట సహకార బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

# సర్కారీ ఎర్రజెండాలపై రైతన్న కన్నెర్ర

- రుణమాఫీ చేసి ఆదుకోవాలని డిమాండ్
- సహకార బ్యాంకు తీరును నిరసిస్తూ ధర్నా
- మాజీ ఎమ్మెల్యే జాజాల సంఘీభావం

లింగంపేట, జూన్ 14: అప్పు చెల్లించలేదని రైతు భూమిలో ఎర్రజెండాలు పాతిన సర్కారు తీరుపై రైతాంగం కన్నెర్ర చేసింది. ప్రభుత్వంతోపాటు సహకార బ్యాంకు వైఖరిని నిరసిస్తూ శుక్రవారం రైతులు ఆందోళనకు దిగారు. రుణం చెల్లించలేదనే కారణంతో కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం పోల్కంపేట్ గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి భూమిలో సహకార బ్యాంకు సిబ్బంది ఎర్రజెండాలు పాతిన సంగతి తెలిసిందే. దీన్ని నిరసిస్తూ రైతులు లింగంపేట సహకార బ్యాంకు ఎదుట శుక్రవారం ధర్నాకు దిగారు. రైతుల ఆందోళనకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ చేయకుండా, అప్పులు చెల్లించడమనం దారుణమని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రుణ మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు రైతుల పక్షాన నిలవాల్సిందిపోయి వారిని ఇబ్బందులకు గురిచేయడం సరికాదని అన్నారు. బ్యాంకు అధికారులు రైతుల పంట పొలాల్లోకి వెళ్లి ఎర్రజెండాలు పాతి భయభ్రాంతులకు గురిచేయడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయాన్ని పండగలా మార్చిన విషయాన్ని గుర్తుచేశారు. డిసెంబర్ 9వ తేదీన రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పటికీ మాఫీ చేయకుండా రైతులను మోసం చేస్తున్నదని అన్నారు. రుణ రికవరీ కోసం రైతు పొలాల్లో ఎర్రజెండాలు పాతడం చరిత్రలో ఇదే మొదటిసారి అని మండిపడ్డారు. రుణాలు తీసుకున్న వారి పొలాల్లో ఎర్ర జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి రైతుల పరువు తీయడం సరికాదని అన్నారు. రైతు భూమిలో బ్యాంకు అధికారులు పాతిన ఎర్రజెండాలను తొలగించాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

### రైతు భూమిలో ఫ్లెక్సీల ఏర్పాటుపై తుమ్మల ఆగ్రహం

నిజామాబాద్ డీసీసీబీ అధికారుల నిర్వాకంపై సీరియస్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): తీసుకున్న రుణం చెల్లించలేదని రైతు భూమిలో ఫ్లెక్సీ కట్టిన నిజామాబాద్ డీసీసీబీ అధికారుల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. బ్యాంకుకు తనఖా పెట్టిన భూమిని ఇతరులకు విక్రయిస్తుండటం వల్లే అలా పెట్టాల్సి వచ్చిందని బ్యాంకు అధికారులు వివరణ ఇవ్వగా, మంత్రి తుమ్మల సీరియస్ అయ్యారు. ఇలా ఫ్లెక్సీలు పెట్టడాన్ని తమ ప్రభుత్వం ఉపేక్షించబోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని పోల్కంపేట్ గ్రామానికి చెందిన రైతు రాజశేఖర్‌రెడ్డి 2010లో డీసీసీబీలో రూ.5 లక్షల దీర్ఘకాలిక రుణం తీసుకున్నాడు. కొన్ని వాయిదాలు చెల్లించి ఆపేశాడు. ఆ తర్వాత ఎన్నిసార్లు సమాచారమిచ్చినా కట్టకపోవడంతో, ఆయన భూమిలో డీసీసీబీ అధికారులు జెండాలు పాతారు. రుణం తీసుకొని 14 ఏళ్లు కావడం, వడ్డీ పెరిగిపోవడంతో తీసుకున్న రూ.5 లక్షల రుణానికి రూ.15 లక్షల వరకు చెల్లించినట్లు రైతు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తే అసలు కట్టుకుంటానని చెప్పాడు.


# విద్యాశాఖకు మంత్రి కావలెను!

- బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ




హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోవడంతో దిక్కులేని శాఖగా మారిందని, వెంటనే ఓ మంత్రిని పెట్టాలని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ డిమాండ్ చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'తెలంగాణకు విద్యాశాఖ మంత్రి కావలెను' అని బోర్డును ఆమె ప్రదర్శించా రు. 'విద్యాశాఖకు సీఎం రేవంత్‌రెడ్డి ఏం చేశాడంటే.. గాడిద గుడ్డు చేశాడు' అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు డీఈవోలు లేరని, 62 డిప్యూటీ డీఈవో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 17 మండలాల్లోనే ఎంఈవోలు ఉన్నారని వివరించారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు కడిగేందుకు కార్మికులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. 22 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే 11వేల ఉద్యోగాలకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్‌లో విద్యాశాఖను నిర్వహించేందుకు అర్హులే లేరా అని ప్రశ్నించారు.

### లోకం పోకడ




### వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 39.3°c | 23.2°c |
| నల్లగొండ | 39.0°c | 24.8°c |
| మెదక్ | 38.1°c | 22.6°c |
| నిజామాబాద్ | 37.8°c | 25.8°c |
| రంగారెడ్డి | 37.7°c | 22.9°c |
| ఖమ్మం | 37.0°c | 26.0°c |
| కరీంనగర్ | 35.0°c | 27.0°c |
| వరంగల్ | 34.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 33.2°c | 23.7°c |
| మహబూబ్‌నగర్ | 32.0°c | 25.0°c |



## మరో మూడు రోజులు వర్షాలు

ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం మెదక్ జిల్లాలో వడగండ్ల వాన, వికారాబాద్ జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో రెండు రోజులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలో ఈ నెల 18 వరకు ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతమే ఉంటుందని తెలిపారు. గురువారం అత్యధికంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం మంగళపల్లిలో 7.4సెం.మీ., ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పెద్దగోపతిలో 6.8 సెం.మీ., రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 5.5సెం.మీ., ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలలో 5.3 సెం.మీ., మధిర మండలం శ్రీపురంలో 5.2సెం.మీ., మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం సంకీసలో 5.2సెం.మీ వర్షం కురిసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ అనేక ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది.

## ప్రాణహిత-చేవేళ్లపై జస్టిస్ ఘోష్ ఆరా

వివిధ విభాగాల ఇంజినీర్ల విచారణ

ప్రాజెక్టు రీడిజైనింగ్‌పై వివరాల సేకరణ

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరంపై ఏర్పాటైన విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై ఆరా తీస్తున్నారు. గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును రీడిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చిన విషయం తెలిసిందే. ఈ అంశాలపైనే జస్టిస్ ఘోష్ దృష్టి సారించినట్టు తెలుస్తున్నది. అందులో భాగంగా శుక్రవారం ఆయన ఈఎన్సీ జనరల్ కార్యాలయం, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) విభాగాల ఇంజినీర్లను విచారించారు. ప్రాణహిత – చేవేళ్లపై విశ్రాంత ఇంజినీర్ల కమిటీ నివేదికను ఎందుకు పక్కన పెట్టారు? కాళేశ్వరం ఎందుకు చేపట్టారు? అని ఇంజినీర్లను ప్రశ్నించినట్టు తెలిసింది. 2015లో ప్రాణహిత చేవేళ్లపై రిటైర్డ్ ఇంజినీర్లు ఇచ్చిన రిపోర్టును అందజేయాలని జస్టిస్ ఘోష్ అధికారులను ఆదేశించినట్టు సమాచారం. ఆ తర్వాత మేడిగడ్డ, అన్నా రం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై విచారించినట్టు కమిషన్ అధికారవర్గాలు వెల్లడించాయి. ఇంజినీర్లకు సంబంధించి విచారణ దాదాపుగా పూర్తయిందని తెలిపాయి. తుది నివేదికనివ్వాలని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీకి సూచించినట్టు వివరించాయి. కాళేశ్వరం ప్లానింగ్‌పై పుణె సీడబ్ల్యూపీఆర్‌ఎస్ నుంచీ నివేదికలను కోరినట్టు వెల్లడించాయి. మొత్తంగా జూలై మొదటి వారంలో ఆయా నివేదికలు వచ్చే అవకాశముందని, 27లోగా అన్ని అఫిడవిట్లు వచ్చాక 10రోజులు పూర్తిస్థాయిలో జస్టిస్ పీసీ ఘోష్ విచారణ జరుపనున్నట్టు కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి.

## పాక్ బడ్జెట్‌లో మైనారిటీలకు సున్నా

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని హిందూ, సిక్కు, క్రైస్తవ మైనారిటీలను ఆ దేశ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. 2024–25 ఫెడరల్ బడ్జెట్‌లో వీరి కోసం కనీసం ఒక రూపాయి అయినా కేటాయించలేదు. గత ఏడాది కేవలం 10 కోట్ల పాకిస్థానీ రూపాయిలను కేటాయించింది. ప్రభుత్వ వైఖరి వల్ల తమ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని మైనారిటీ నేతలు మండిపడుతున్నారు. 24.4 కోట్ల పాక్ జనాభాలో హిందువులు 1.6 శాతం, క్రైస్తవులు 1.6 శాతం ఉన్నారు. సిక్కులు, ఇతర మతాలవారితో కలిపితే మొత్తం మైనారిటీల జనాభా కేవలం 5 శాతం మాత్రమే.